# సమైక్యంగా, సంఘటితంగా పోరాడటమే కార్మికుల, శ్రామిక ప్రజల సమస్యల పరిష్కార సూత్రం

ది పార్టీ ఆఫ్ లేబర్ ఆఫ్ ఇరాన్ (టౌఫాన్)

**నూతనంగా** గర్భం దాల్చివున్న ప్రతి పాత సమాజానికీ విప్లవం మంత్రసానివంటిది. ఇరాన్‌లో పునాదివర్గ ఉద్యమాలు–పేదరికంలో మగ్గిపోతున్న ప్రజారాశుల ప్రాణాలను సైతం పీల్చివేసేందుకు ప్రయత్నిస్తూ, ప్రజలకు ఏవిధంగానూ జవాబుదారీగా వుండని నేరపూరిత మాఫియా రాజకీయ అధికారాన్ని సంపూర్ణంగా వ్యతిరేకించే దానియొక్క వ్యక్తీకరణే.

ఇది – అజ్ఞానానికి వ్యతిరేకంగా జ్ఞానం సాగించే ఉద్యమం; పేదరికానికి, నిరుద్యోగానికి, అవినీతికి, ఉన్నతాధికారుల కోట్ల డాలర్ల నిధుల దుర్వినియోగానికి, కోట్లాది శ్రామిక ప్రజల అతికొద్ది పొదుపు మొత్తాలను సైతం లూటీచేస్తున్న విధానాలకు, రాజకీయ అణచివేతలకు వ్యతిరేకంగా ఉద్యమమిది. సంవత్సరాలుగా సహనంతో వేచివున్న కోట్లాదిమంది ప్రజలయొక్క ఆగ్రహావేశాలివి. ఈ ప్రజలే ఇప్పుడు ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వాన్ని సవాల్‌చేస్తూ, దాని పునాదిని కుదిపివేస్తున్నారు.

ప్రభుత్వ నయాఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా ప్రజలలో తలెత్తిన అసంతృప్తి, ఆగ్రహాల మూకుమ్మడి వ్యక్తీకరణే, ఇటీవలి ప్రజాఉద్యమం. గత అనేక దశాబ్దాలనుండి గూడుకట్టుకుంటూ వస్తోన్న ఈ ఆగ్రహం ఒక్కచోట పోగుపడింది.

డబ్ల్యుటిఓ, అంతర్జాతీయ ద్రవ్యనిధిసంస్థ, ప్రపంచబ్యాంకుల ఆదేశాల అమలును ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వం తీవ్రతరం చేసింది. ఫలితంగా ప్రజానీకపు ఆర్థిక పరిస్థితి వేగంగా దిగజారి పోయింది; పేదరికపు స్థాయి పెరిగిపోయింది; ద్రవ్యోల్బణం చుక్కల్ని తాకింది; జీవన వ్యయం భారీగా పెరిగింది; సాధారణ ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోయింది; తాగునీరు, చమురువాయువు, విద్యుత్తు, మరియు ఇతర ఇంధనాల ధరలు పెరిగి పోయాయి.

గత 7 సంIIల కాలంలో, ప్రత్యేకించి 2017లో సమాజంలోని వివిధ సెక్షన్లు–కార్మికులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, నిరుద్యోగులు, నర్సులు, బ్యాంకులోని తమ పొదుపు మొత్తాలు లూటీ చేయబడిన వేలాది ప్రజలు–మొదలైన వారంతా సమ్మెలు, ప్రదర్శనలు, నిరసనలు అనేకం చేపట్టారు. ఈ పరిస్థితికి ప్రతిస్పందనగా సాధారణ నిరసన కూడా పెరుగుతోంది.

దీనికితోడుగా ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వం లోని ముఠాలమధ్య అంతర్గత పోరు తీవ్రమైంది. నిరసనకారులు వీరి అంతర్గత పోరును ఉపయోగించుకొని ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వంలోని అన్ని ముఠాలపై ఎక్కుపెట్టారు.

కమ్యూనిస్టులనుండి విప్లవకారులవరకు, సాధారణ ప్రజలనుండి సంఘటితశక్తుల వరకు, నిరంకుశలనుండి ప్రతీఘాతుకులు, సామ్రాజ్యవాద అనుకూల మొజాహిదీన్‌లు మరియు సామ్రాజ్య వాదుల, యూదుమతవాదుల వ్యక్తిగత ఏజెంట్ల వరకు–అన్ని సామాజిక, రాజకీయ విభాగాలన్నీ ఈ నిరసనలలో పాల్గొంటున్నాయి. యువజనులనుండి వచ్చిన ప్రస్తుత ఉద్యమం, అప్రయత్నంగా ముందు కొచ్చింది. ప్రస్తుతానికి దీనికి సంఘటిత నాయకత్వం లేదు. ఇబ్బందులు ఏమైనప్పటికీ, ఇస్లామిక్ రిపబ్లిక్ యొక్క గత నాలుగు దశాబ్దాల నేరస్థపాలన ఫలితంగా సాధారణ ప్రజానీకంలో పెల్లుబికిన అసంతృప్తికి నిజాయితీతో కూడిన ఒక వ్యక్తీకరణే ఈ ఉద్యమం. ఈ నిరసనోద్యమం ఆర్థిక డిమాండ్లతో ప్రారంభమై రాజకీయ అంశాల దిశగా ముందుకు సాగుతోంది.

అణచివేత, తీవ్రమైన హింసలను ప్రయోగించి దాదాపు గత నలభై సంవత్సరాలుగా పాలన సాగిస్తోన్న ఇస్లామిక్ రిపబ్లిక్‌కు వ్యతిరేకంగా ఇరాన్ ప్రజలు సాగిస్తున్న న్యాయమైన, సరైన ఉద్యమాన్ని 'ది పార్టీ ఆఫ్ లేబర్ ఆఫ్ ఇరాన్'(టౌఫాన్) స్వాగతిస్తోంది. ఈ ఉద్యమాన్ని గాడితప్పించటానికి ప్రయత్నించే దూకుడుగా వున్న సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా స్పష్టమైన, సూటైన అభిప్రాయం కలిగివుంటూ, ప్రజారాశుల ఐక్యత పైన మేము నొక్కి చెబుతున్నాము.

వీధుల్లో కార్మికులసంఖ్య పెరుగుతున్న సూచనలు ఇప్పటికి ఇంకా లేవు. ఒక దేశవ్యాపిత సాధారణ సమ్మె ప్రభుత్వపాలనను వెనక్కుగొట్టి వీధుల్లో ఆందోళనకారులు మరింతగా నిరసనలు కొనసాగించటానికి అవకాశం కల్పిస్తుంది. అసమ తుల్యంగా వున్న వర్గశక్తులు, రాజకీయ సంఘటితతత్వలోపం, వీధుల్లో ఆందోళన కారులు వేసారి పోయివుండటం అనేవి ఉద్యమానికి అనుకూల పరిస్థితిని సృష్టించలేవు.

మధ్యప్రాచ్యంలో అమెరికా సామ్రాజ్యవాదులు, ఇజ్రాయిలీ మతతత్వవాదులు తమ ఆదేశాలకు లొంగని, లోబడని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఏ ఉద్యమాలనైనా ప్రేరేపించే ప్రయత్నం చేస్తున్నారు. అమెరికా సామ్రాజ్యవాదుల, ఇజ్రాయిలీ మతోన్మాదుల ఏజెంట్లు, బంట్లు ఈ ఉద్యమంలో కనిపించటం వలన, ఈ ఉద్యమంయొక్క స్వభావం సరిగ్గా వ్యక్తీకరించబడదు. ఇరాన్‌లో ప్రస్తుత ప్రజా ఉద్యమంలో, ఈ ఏజెంట్ల పాత్ర ఆధిక్యంలో వుంది. ఇది క్రిందినుండి పైకెగసిన అప్రయత్న ఉద్యమం; పైనుండి క్రిందకు నిర్మాణయుతమైందికాదు. అదే సమయంలో, కమ్యూనిస్టులు, వామపక్షాలు, ప్రగతిశీలశక్తులు ఈ ఊరేగింపులలో వ్యక్తమయ్యే తప్పుడు నినాదాలు, అవగాహనలపట్ల అప్రమత్తంగా వుండి వాటి స్వభావాన్ని విశ్లేషించి, ప్రజలకు విడమరచి, వెల్లడిచేయాలి.

“తిండి, ఉద్యోగం, ఇల్లు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యపాలన” వంటి డిమాండ్లు మరింత స్పష్టంగా వ్యక్తంచేస్తే; పాత సామాజిక వ్యవస్థను కూలదోయాలి, వంశపారంపర్య నిరంకుశత్వాన్ని కూలదోయాలి–వంటి నినాదాలు ముందుకొస్తే, ప్రభుత్వంలోని ముఠాలతో రాజీపడే నినాదాలను ఉద్యమంలోని శ్రేణులు తిరస్కరిస్తాయి. అప్పుడు–సమాజంలో మౌలిక డిమాండ్లకు

నిజమైన ప్రతినిధులుగా వున్న విప్లవశక్తులు, సామ్రాజ్యవాదుల జోక్యందారీ విధానాలను గాఢంగా వ్యతిరేకించే శక్తులు ప్రత్యేకించి మార్క్సిస్టు-లెనినిస్టు శక్తుల ఆధ్వర్యంలో ఉద్యమం తన లక్ష్యాలను సాధిస్తుందని ఎవరైనా ఆశించటానికి అవకాశముంది.

వీధుల్లో పోరాడుతున్న ప్రజారాశులు అపరిపక్వ హింసకు పాల్పడరాదని, దానిపట్ల అప్రమత్తంగా వుండాలని 'ది పార్టీ ఆఫ్ లేబర్ ఆఫ్ ఇరాన్' పిలుపునిస్తోంది. సామ్రాజ్యవాదుల, యూదు మతతత్వవాదుల ఏజెంట్లు, అమ్ముడుబోయే బృందాలు మానవ ప్రాణానికి విలువనివ్వవు. వారు తమ ప్రయోజనాలనే చూసుకుంటారు. ప్రజలకు వచ్చే ప్రతి పిలుపునూ జాగ్రత్తగా పరిశీలన చేయాలి; దాని మూలాన్ని పరిశోధించాలి.

స్వతంత్ర సంఘాల ఏర్పాటుహక్కు, ఉద్యోగం, ఇంటివసతి, నిరుద్యోగ భృతిహక్కు, సంఘహక్కు, సమావేశహక్కు, రాజ్యంనుండి విద్యనుండి మతాన్ని దూరంగా వుంచాలని, లింగపర వివక్ష, అణచి వేతలను రద్దుచేయాలని, వారికి నిర్బంధ బురఖాలు, వస్త్ర నిబంధనలను రద్దుచేయాలని, రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలనేవి-ఆందోళన కారుల డిమాండ్లలో భాగంగా వున్నాయి. 'ది పార్టీ ఆఫ్ లేబర్ ఆఫ్ ఇరాన్' ఈ డిమాండ్లకు తన హృదయపూర్వక మద్దతునిస్తోంది. ఇస్లామిక్ ప్రభుత్వంలోని ఏ ముఠాకు కూడా ప్రజల ఈ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే దృష్టిలేదు.

నిరసనకారులను ప్రభుత్వం క్రూరంగా కాల్చిచంపడాన్ని 'ది పార్టీ ఆఫ్ లేబర్ ఆఫ్ ఇరాన్' తీవ్రంగా ఖండిస్తోంది. "అంతర్జాతీయ మార్క్సిస్టు- లెనినిస్టు పార్టీల, సంస్థల మహాసభ"లోని సోదర పార్టీలు, సంస్థలు; విప్లవశక్తులు, ప్రగతిశీలశక్తులు, ప్రజాతంత్రవాదులు, ఇరాన్‌లో ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వం సాగించిన నేరాలకుగానూ దానిని ఖండించవలసిందిగా, నిర్బంధంలోకి తీసుకున్న ఆందోళనకారులందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేయాల్సిందిగా పిలుపు నిస్తోంది.

**2018 జనవరి 1**

ooooo